చెన్నూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న కౌన్సిలర్ మహేశ్

చెన్నూర్, జనవరి 24: చెన్నూర్ పట్టణంలోని నల్లగొండ పోచమ్మ వాడలో బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి వార్డు కౌన్సిలర్ రేవెల్లి మహేశ్ కృషితో అధికారులు శుక్రవారం నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఆ వార్డులో లోవోల్టేజీ కారణంగా విద్యుత్ సరఫరాలో నిత్యం అంతరాయం ఏర్పడుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కౌన్సిలర్ రేవెల్లి మహేశ్... విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి ట్రాన్స్ ఫార్మర్‌ను ఏర్పాటు చేయించారు. ప్రజల కోరిక మేరకు పని చేస్తానని, సమస్యలను తీర్చేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

మాజీ రాజ్యసభ సభ్యుడిని కలిసిన బీఆర్ఎస్వీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు



సంతోష్ కుమార్‌తో బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్

బెల్లంపల్లి, జనవరి 24 : మాజీ రాజ్యసభ సభ్యుడు, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సృష్టికర్త జోగినపల్లి సంతోష్ కుమార్‌ను హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో శుక్రవారం బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ మార్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ప్రజల తరపున పోరాటాలు చేయాలని కోరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి బీఆర్ఎస్వీ ముందుండి కేసీఆర్ పాలన తిరిగి తీసుకురావాలని పేర్కొన్నారు.

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలటౌన్, జనవరి 24 : ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, రైతు భరోసా పథకాలకు ఎంపికైన వారి పేర్లు చదివి వినిపించడం, లిస్టులో పేర్లు లేని వారితో మళ్లీ దరఖాస్తులు తీసుకునేందుకు నిర్వహిస్తున్న వార్డు సభలు శుక్రవారంతో ముగిశాయి. మంచిర్యాలలో చివరి రోజు 25వ వార్డు నుంచి 36వ వార్డు వరకు వార్డుల వారీగా సభలు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో కూడా ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటుచేసి, దరఖాస్తులు స్వీకరించారు. మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్ వార్డు సభలు జరుగుతున్న తీరును పరిశీలించారు.

దివ్యాంగులకు న్యాయం చేయాలి

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 24 : సంక్షేమ పథకాల అమలులో దివ్యాంగులకు న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం అదనపు కలెక్టర్ డేవిడ్‌కు దివ్యాంగులు వినతిపత్రం అందజేశారు. జీవో ప్రకారం ఐదు శాతం దివ్యాంగులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. ఆర్థిక పరిమితి లేకుండా రేషన్ కార్డులను జారీ చేయాలని తెలిపారు. ఇస్లాంబిన్ హాసన్, కయ్యూమ్, బన్న మూర్తి, శ్రీనివాస్, రాజయ్య, రాజేశ్, రవీందర్ ఉన్నారు.

నేడు ఓటరు దినోత్సవ ర్యాలీ

కౌటాల, జనవరి 24 : జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాల నుంచి తహసీల్ కార్యాలయం వరకు శనివారం ర్యాలీ తీయనున్నట్లు నాయబ్ తహసీల్దార్ మునావర్ షరీఫ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని రాజకీయ పార్టీ నాయకులు, యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి

- మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు
- భవన నిర్మాణ సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారం



భవన నిర్మాణ సంఘం కార్యవర్గ సభ్యులతో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాల టౌన్, జనవరి 12 : భవన నిర్మాణ రంగం కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు పనిచేయాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం మంచిర్యాల భవన నిర్మాణ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. మంచిర్యాలతో పాటు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి నిత్యం వేలాది మంది కార్మికులు ఇక్కడకు వచ్చి పనిచేస్తుంటారని, వివిధ రంగాల కార్మికులు భవన నిర్మాణం రంగంలో పాలుపంచుకుంటారని పేర్కొన్నారు. అలాంటి కార్మికుల విషయంలో ఎన్నికైన కమిటీ సభ్యులు మంచి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, అధునాతన పద్ధతుల్లో నిర్మాణ రంగానికి వన్నె తీసుకురావాలన్నారు. కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమానికి సంఘం తరపున భరోసా కల్పించే నిర్ణయాలు తీసుకోవాలని, కార్మికుల హక్కులను కాపాడాలని, ప్రభుత్వం నుంచి కార్మికుల కోసం అమలు చేస్తున్న పథకాలను అందరికీ అందేలా చూడాలని వివరించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు పడాల రామన్న, ప్రధాన కార్యదర్శి మక్కా మురళి, మధునయ్య, మామిడి శ్రీనివాస్, పెద్దటీకయ్య, బీఆర్ఎస్ నాయకులు గోగుల రవీందర్‌రెడ్డి, అంకం నరేశ్, శ్రీరాముల మల్లేశ్, పడాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రుణాల పేరిట భారీ స్కాం..!

- చనిపోయిన వారి పేరిట కోట్లల్లో స్వాహా!
- వాయిదాలు చెల్లించకపోవడంతో మంచిర్యాలలో వెలుగులోకి ఉదాంతం
- విచారణ చేపడుతున్న పోలీసులు

మంచిర్యాల అర్బన్, జనవరి 24 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రముఖ ఫైనాన్స్ కంపెనీలో రుణాల పేరిట భారీ స్కాం జరిగినట్లు, చనిపోయిన వ్యక్తుల పేరిట రూ.6 కోట్ల వరకు రుణాల స్వాహా చేసినట్లు శుక్రవాం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రుణాలు తీసుకున్న వారంతా వాయిదాలు చెల్లించకపోవడంతో ఈ ఉదాంతం బయటకు పొక్కింది. దీంతో సదరు ఫైనాన్స్ కంపెనీ యాజమాన్యం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, దీనిపై పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నట్లు సమాచారం. పూర్తి వివరాల్లోకి వెళితే.. జిల్లా కేంద్రంలోని జన్మభూమి నగర్‌లో గల ఓ ప్రముఖ ఫైనాన్స్ కంపెనీ వ్యక్తిగత, వాహన, ఇండ్లు, మార్టిగేజ్ రుణాలు ఇస్తున్నది. ఇందులో చెన్నూర్, పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన ఇద్దరు ఉద్యోగులు (మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్)గా పని చేస్తున్నారు. జిల్లాలో చనిపోయిన వారు బతికున్నట్లు సృష్టించి వారి పేరిట ఆధార్ కార్డులు తయారు చేయించి, రుణాలు ఇప్పించారు. కొంత కాలం వాయిదాలు చెల్లించగా, రానురాను జాప్యం జరిగింది. అనుమానం వచ్చిన సదరు ఫైనాన్స్ హెడ్ ఆఫీస్‌కు చెందినవారు కొద్ది రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసుకొని చనిపోయిన వారి ఆధార్ కార్డులు.., ఎవరు ఎంత రుణం తీసుకున్నారు.., ఇలాంటి బాదితులు ఇంకా ఎంత మంది ఉన్నారు.., ఎవరేవరి సహకారం ఉందనే దానిపై పూర్తి స్థాయి విచారణ జరుపుతున్న తెలుస్తున్నది.

ఈ విషయమై మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్‌ను వివరణ కోరగా, ఫైనాన్స్‌కు సంబంధించిన వ్యక్తులు మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నామని పేర్కొన్నారు. త్వరలో వివరాలు వెల్లడిస్తామని వివరించారు.

సింగరేణి ఉత్తమ ఉద్యోగుల ఎంపిక

మందమర్రి, జనవరి 24 : గణతంత్ర దినోత్సవం సందర్భంగా మందమర్రి ఏరియాలోని 12 మంది ఉద్యోగులను ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేసినట్లు పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ సింగరేణియన్‌గా ఆర్కే ఓసీపీ ఎలక్ట్రికల్ ఇన్‌చార్జి ఫోర్‌మన్ సయ్యద్ అబ్బాస్‌ను కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో సీఎండీ బలరాం చేతుల మీదుగా సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. మిగతా వారిని ఏరియాలో నిర్వహించే వేడుకల్లో జీఎం జీ దేవేందర్ చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. ఏరియాలోని ఉత్తమ ఉద్యోగులుగా శాంతిఖని గని ఫిట్టర్ ఏ శ్రావణ్ కుమార్, జనరల్ మజ్దూర్ దుర్గం రాజేశ్, కాసిపేట-2 గని ఓవర్‌మన్ ఎన్ సుభాశ్ చంద్రబోస్, ఫిట్టర్ గుగులోత్ సురేశ్, కాసిపేట గని లైన్‌మన్ లీనాల వెంకటయ్య, ట్రామర్ కడారి శ్రీనివాస్, కేకే-5గని హాలర్ ఆపరేటర్ ఎండీ చాంద్, ఓవర్‌మన్ బండారి తిరుపతి, కేకే ఓసీపీ హెడ్ ఓవర్‌మన్ జీ శ్రీనివాస్, వెల్డర్ కే రమేశ్, ఆర్కే ఓసీపీ ఎంవీ డ్రైవర్ సీహెవ్ రమేశ్, జనరల్ మజ్దూర్ కొండు శేషన్ కుమార్ ఎంపికైనట్లు వివరించారు.

శ్రీరాంపూర్ ఏరియా నుంచి..

శ్రీరాంపూర్, జనవరి 24 : శ్రీరాంపూర్ ఏరియా ఉత్తమ కార్మికుల వివరాలను డీవైజీఎం అరవిందరావు వెల్లడించారు. సలాకల సత్తయ్య, దండబోయిన లక్ష్మణ్‌స్వామి(ఆర్కే-5), గొర్రె నర్సయ్య, తుమ్మల రాజిరెడ్డి (ఆర్కే-6), గోపాల్‌రెడ్డి, తుమ్మ జనార్దన్(ఆర్కే-7), ఓదయ్య, దుర్గం రమణమూర్తి(ఆర్కే న్యూటెక్), ఎం ఓదెలు, వరాల శంకరయ్య(ఎస్సార్పీ 1), ఎల రాజేశ్, ఆలేటి ఆదిరెడ్డి(ఎస్సార్పీ 3), కాసర్ల ఆశోక్‌రెడ్డి, ఎండీ జాకీర్‌హుస్సేన్(ఇందారం 1ఏ), ఎస్ శ్రీనివాస్, పీ పద్మరాజు(ఇందారం ఓసీపీ), నల్లపు సత్తయ్య, సందెవేన గట్టయ్య(శ్రీరాంపూర్ ఓసీపీ)ను చేసి ప్రకటించారు. వీరిని జీఎం సూర్యనారాయణ సన్మానించనున్నట్లు, అలాగే ఉత్తమ సింగరేణియన్‌గా ఆర్కే 5గనికి చెందిన ఎస్‌డీఎల్ ఆపరేటర్ ఏ శ్రీనివాస్‌ను ఎంపిక చేసినట్లు వివరించారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

మందమర్రి రూరల్, జనవరి 26 : క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధి 14వ వార్డులో నూతన డ్రైనేజీ నిర్మాణ పనులకు కౌన్సిలర్ గడ్డం విజయలక్ష్మీరాజు శుక్రవారం శంకుస్థాపన చేశారు. రాజేశ్వరి, భాగ్యలక్ష్మి, లలితా, కవిత, చెరాలు తదితరులు పాల్గొన్నారు.

బన్సల్ కళాశాలను మూసివేయాలి

- తనిఖీ చేసిన ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి అంజయ్య

నస్పూర్, జనవరి 24 : మంచిర్యాలోని బన్సల్ కార్పొరేట్ కళాశాలను శుక్రవారం మంచిర్యాల జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి అంజయ్యతనిఖీ చేశారు. కళాశాల అనుమతులు, తదితరాలపై విచారణ చేపట్టారు. రెండు రోజుల్లో కళాశాలను మూసివేయాలని సూచించారు. లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కళాశాల ఏర్పాటు చేశారని, టెలీకాలర్లను ఏర్పాటు చేసుకొని విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేస్తూ మభ్యపెడుతున్నారని తెలిపారు. కళాశాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రవీణ్‌కుమార్, షేక్ సల్మాన్‌పాషా, అల్లి సాగర్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి రూరల్ : విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యాధికారి అంజయ్య

మందమర్రి రూరల్, జనవరి 24 : విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య సూచించారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో సమావేశం నిర్వహించి, విద్యాప్రగతి, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తండ్రిని కడతేర్చిన కసాయి

- జైపూర్ మండలం ఇందారంలో ఘటన
- పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన కొడుకు

రాజయ్య (ఫైల్)

జైపూర్, జనవరి 24 : కుటుంబ కలహాలతో కన్న తండ్రిని కొడుకే గొంతుకోసి కిరాతంగా చంపిన ఘటన జైపూర్ మండలం ఇందారం గ్రామం లో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకున్నది. ఎస్ఐ శ్రీధర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆవిడపు రాజయ్య (45) ఆటో డ్రైవర్. భార్య భాగ్య, కూతురు యోగిత, కొడుకు సాయి సిద్ధార్థ ఉన్నారు. కూతురు కొద్దిరోజుల క్రితం ప్రేమవివాహం చేసుకొని ఇంటినుంచి వెళ్లిపోయింది. కొడుకు సిద్ధార్థ ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. రాజయ్య కొంతకాలంగా చెడు తిరుగుళ్లు తిరుగుతున్నాడన్న విషయంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. పది రోజుల క్రితం భర్తతో గొడవపడ్డ భార్య భాగ్య.. నస్పూర్ ప్రాంతంలోని తన అన్నయ్య ఇంటికి వెళ్లింది. అప్పటినుంచి రాజయ్య ఒంటరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి నిద్రిస్తున్న సమయంలో సిద్ధార్థ, తన స్నేహితులు నర్వ గ్రామానికి చెందిన పొట్టాల వినయ్, అరుణక్క నగర్‌కు చెందిన జనంపల్లి సందీప్‌తో వచ్చి తండ్రితో గొడవ పడ్డాడు. ఈ గొడవలో స్నేహితుల సాయంతో వెంట తెచ్చుకున్న కత్తితో తండ్రి గొంతుకోశాడు. తండ్రి ఆటో తీసుకొని జైపూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. హత్య విషయమై విచారణ చేపట్టిన పోలీసులు క్లూస్ టీం ద్వారా వివరాలు సేకరించారు. ఘటనా స్థలాన్ని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు సందర్శించి, హత్య తీరును పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరాలపై దాడి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 24 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని వివిధ మండలాల్లో పేకాట స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఏకకాలంలో దాడులు నిర్వహించారు. రాహపల్లి, బూరుగూడ, రాజుర గ్రామ శివారుల్లో ఏడుగురిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ రాణాప్రతాప్ తెలిపారు. వారి నుంచి రూ.3,800, నాలుగు మొబైల్ ఫోన్లు, ఒక బైకు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఆసిఫాబాద్ మండలం అడ గ్రామ శివారులో ఎస్ఐ ప్రశాంత్ 9 మందిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.10,800, మూడు బైకులు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

నాటుసారా స్థావరాలపై..

కోటపల్లి, జనవరి 24 : కోటపల్లి మండలం సర్వాయిపేట, ఎసన్వాయి గ్రామాలోల నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్, పోలీస్‌లు దాడులు నిర్వహించారు. ఆదిలాబాద్, మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ సీఐలు అక్బర్ హుస్సేన్, సమ్మయ్య, చెన్నూర్ ఎక్సైజ్ సీఐ ఎం హరి, ఎస్ఐ వెంకటేశ్, కోటపల్లి ఎస్ఐ రాజేందర్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. పొలాల్లో సారా తయారు చేసేందుకు ఏర్పాటు చేసిన బెల్లం పానకం ధ్వంసం చేయడంతో పాటు, 12 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా తయారు చేస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

మందుబాబులకు జైలు శిక్ష

మంచిర్యాల అర్బన్, జనవరి 24 : మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ నలుగురికి శుక్రవారం మంచిర్యాల జిల్లా సెకండ్ అడిషనల్ కోర్టు సివిల్ జడ్జి నిరోష జైలు శిక్ష విధించినట్లు మంచిర్యాల ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ తెలిపారు. ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 33 మందిని కోర్టులో హాజరు పర్చగా, నలుగురికి ఐదు రోజుల పాటు జైలు శిక్షను విధించినట్లు పేర్కొనారు. మిగతా వారికి రూ.65,500 జరిమానా విధించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

మందమర్రి, జనవరి 24 : మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధి యాపల్ ఏరియా సింగరేణి ఎల్లందు క్లబ్ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పిల్లలమర్రి లలిత(58) మృతి చెందినట్లు పట్టణ ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. యాపల్ ఏరియాకు చెందిన లలిత పాతబస్టాండ్ ఏరియాలో కూరగాయలు తీసుకొని, తిరిగి ఇంటికి వెళ్తున్నది. ఈ క్రమంలో రోడ్డు దాటుతుండగా, మంచిర్యాల నుంచి బెల్లంపల్లి వైపు వెళ్తున్న లారీ ఢీ కొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది. లలిత కొడుకు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువతి మిస్సింగ్

జైనూర్, జనవరి 24 : జైనూర్ మండలం శివనూర్ గ్రామానికి చెందిన యువతి శిల్ప(20) అదృశ్యమైనట్లు జైనూర్ ఎస్ఐ సాగర్ తెలిపారు. శిల్ప భద్రాచలంలోని పాల్వంచ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్నది. సంక్రాంతి పండుగ సెలవులకు ఇంటికి వచ్చి, తిరిగి 20వ దీన పాల్వంచలోని కలాశాలకు వెళ్తానని చెప్పి, ఇంటిని బయల్దేరింది కొద్దిసేపటి తర్వాత తండ్రి పవార్ సుభాష్ ఫోన్ చేయగా, బస్సులో ప్రయాణికులు ఎక్కువగా ఉన్నారని తర్వాత ఫోన్‌చేస్తానని కట్ చేసింది. మధ్యాహ్నం తిరిగి ఫోన్ చేయగా, స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో మేనలుడు జాదవ్ ప్రదీప్‌కు ఫోన్ చేయగా, అతని ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ వచ్చింది. ప్రదీప్ ఇంట్లోని నగదు తీసుకొని వెళ్లాడు. తెలిసిన వారి వద్ద, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతకడంతో పాటు అరా తీసినా జాడతెలియకపోవడంతో సుభాష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బెహరాన్ దేశంలో జన్నారం వాసి మృతి

రమేశ్ (ఫైల్)

జన్నారం, జనవరి 24 : మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కూకటికారి రమేశ్(47) బెహరాన్ దేశంలో 20వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రెండేళ్ల క్రితం బెహరాన్ వెళ్లి, కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మృతదేహం శుక్రవారం రాత్రి వరకు స్వగ్రామానికి రానున్నట్లు తెలిపారు. రమేశ్‌కు భార్య చంద్రిక, కూతురు కావ్య, కొడుకు కౌశిక్ ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

తాండూర్, జనవరి 24 : తాండూర్ మండలం అచ్చలాపూర్ శివారులో గల పెద్దమడుగు నీటి కుంటలో చేపలు వేటకు వెళ్లి చాకెపల్లి గ్రామానికి చెందిన జక్కుల మొండి (50) ప్రమాదవశాత్తు మునిగి మృతిచెందినట్లు తాండూర్ ఎస్ఐ డీ కిరణ్‌కుమార్ తెలిపారు. మొండి గురువారం సాయంత్రం చేపల వేటకు వెళ్లాడు. మడుగులో చేపలు పడుతుండగా, ప్రమాదవశాత్తు వల కాళ్లు, చేతులకు చుట్టుకొని మునిగిపోయాడు. మొండి తల్లి జక్కుల వెంకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కవ్వాల్‌లో విద్యార్థుల పర్యటన

నార్లాపూర్ అడవుల్లో విద్యార్థులతో అటవీ అధికారులు

జన్నారం, జనవరి 24 :కవ్వాల్ టైగర్ రిజర్వ్ జన్నారం డివిజన్ ఇందన్‌పెల్లి రేంజ్ అడవుల్లో శుక్రవారం హైదరాబాద్‌లోని ఎఫ్‌సీఆర్ఐ కళాశాలకు చెందిన 54 మంది విద్యార్థులు పర్యటించినట్లు ఎఫ్ఆర్వో ప్రవీనివాస్ తెలిపారు. రేంజ్ పరిధిలోని నార్లాపూర్ బీట్‌లోని ఘనిశెట్టి కుంట, మైసమ్మకుంట, అడవుల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు, వన్య ప్రాణుల, పక్షులు, సీతాకోక చిలుక ప్లాంటేషన్, గడ్డిక్షేత్రాల అభివృద్ధికి తీసుకుంటు జాగ్రత్తలను వివరించారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

తాండూర్, జనవరి 24 : వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఉత్తమ విద్యాబోధన ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులను తయారుచేయడంలో ఉపాధ్యాయులు కార్యోన్ముఖులు కావాలని తాండూర్ ఎంఈవో ఎస్ మల్లేశం సూచించారు. తాండూర్ జడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల ముగింపు కార్యక్రమంలో పాల్గొని అవగాహన కల్పించారు. పభుత్వ ఉపాధ్యాయులు తమ విధి నిర్వహణలో భాగంగా సమయపాలన పాటిస్తూ ఉద్యోగ బాధ్యతలను అంకిత భావంతో నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్, ఉమా, రిసోర్స్ పర్సన్లు వేణుగోపాలరావు, సంపత్, చంద్రశేఖర్, కగపతి, సీఅర్పీ తిరుపతి పాల్గొన్నారు.

స్నేహితురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

తాండూర్, జనవరి 24 : తమతో కలిసి చదువుకున్న తోటి స్నేహితురాలు మృతి చెందగా, బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారు మాదారం టౌన్‌షిప్‌లోని సింగరేణి పాఠశాల 2001-02 బ్యాచ్ విద్యార్థులు. మాదారం టౌన్‌షిప్‌నకు చెందిన రజిత ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె కూతురు సాయి చందన ప్రభుత్వ హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నది. పేదకుటుంబం కావడంతో ఆమె తాత రాజిరెడ్డి మాదారం పంచాయతీలో చిరుద్యోగి. విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు రూ.50 వేలు జమ చేసి, సాయిచందన పేరిట బ్యాంక్‌లో డిపాజిట్ చేశారు.

ప్రజా పాలన దరఖాస్తులు పనికి రావా?

తాండూర్, జనవరి 24 : ప్రజా పాలనలో గ్రామ సభల్లో పెట్టిన ధరకాస్తులు పనికి రావా..? అని సీపీఎం పార్టీ మంచిర్యాల జిల్లా కమిటీ సభ్యుడు దాగాం రాజారాం ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తాండూర్ ఐబీలో శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి, ఆయన మాట్లాడారు. ఏడాది క్రితం అధికారులు ఇంటింటా తిరిగి చేసిన సర్వేకు విలువ లేదా..?, కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజాయితీ ఉంటే, గతంలో పెట్టిన దరఖాస్తుల ఆధారంగా 6 గ్యారెంటీలు అమలు చెయ్యాలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దుర్గం నానయ్య, జీ రమణ పాల్గొన్నారు.

నేటి నుంచి ఉర్సు

చెన్నూర్ టౌన్, జనవరి 24 : చెన్నూర్ పట్టణంలోని జామా (పెద్ద) మసీదు వెనుక దర్గా వద్ద హజ్రత్ సయ్యద్ షా బాబా రహెమతుల్లా అలై ఉర్సు శనివారం నుంచి ప్రారంభం కానున్నది. మత సామరస్యానికి ప్రతీకగా యేటా నిర్వహించే ఉత్సవాలు రెండు రోజుల పాటు అట్టహాసంగా కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాట్లు చేశారు.

జాతీయస్థాయి పోటీల్లో బోణీ

ప్రతిభ చూపిన తెలంగాణ జట్టు

బెల్లంపల్లి, జనవరి 24 : జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 సాఫ్ట్‌బాల్ పోటీల్లో తెలంగాణ జట్టు బోణీ కొట్టింది. మహారాష్ట్రలోని ఔరంగాబాద్ శంబాజీ నగర్‌లో 23 నుంచి జరుగుతున్న 68వ జాతీయస్థాయి పోటీల్లో శుక్రవారం గుజరాత్‌పై 5-6 తేడాతో తొలి విజయం సాధించినట్లు ఉమ్మడి జిల్లా కార్యదర్శి బొంకూరి బాబురావు, ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శి మంతెన సమ్మయ్య తెలిపారు. తొలివిజయం సాధించిన క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు.

సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

నస్పూర్, జనవరి 24 : మంచిర్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభించనున్న గిరిజన అధ్యయనం కోర్సుకు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి, అర్థశాస్త్ర విభాగాధిపతి గోపాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు, ఫిబ్రవరి 3 నుంచి కోర్సు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టండి

రెబ్బెన, జనవరి 24 : పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని గిరిజన సంక్షేమ శాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి పుర్క ఉద్దవ్ పేర్కొన్నారు. మండలంలోని గోలేటి ఆశ్రమోన్నత పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, భోజనం, కంప్యూటర్లను పరిశీలించారు. ఏసీఆర్‌పీ రాథోడ్ రవీందర్, హెచ్ఎం రవీందర్, ఉపాధ్యాయులు ప్రభాకర్, గణపతి, అనూష ఉన్నారు.

26న వాంకిడిలో 2కే రన్

వాంకిడి, జనవరి 24 : గణతంత్ర దినోత్సవం సందర్భంగా 26న మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహిస్తున్నట్లు యువజన సంఘం నాయకుడు దుర్గం ప్రశాంత్